# స్మృతి
## శ్రీనివాసులు

సాయంత్రం అయిదు దాటింది. ఆఫీసు కార్యక్రమాలు ముగించుకుని రోడ్డున పడ్డాను. ఏవేవో విషయాలు ఆలోచిస్తూ నడుస్తున్నాను.

ఇంతలో “సార్!” అని కేక వినపడింది.

నన్నే నేమో అని వెనుదిరిగి చూశాను.

రామారావు రొప్పుతూ వచ్చి నన్ను కలుసుకున్నాడు.

“ఏమిటి రామారావ్ విశేషం?”

“మీతో కలసి వద్దా మనుకున్నాను. కానీ ఫైళ్ళు సర్దుకొనేసరికి వెనుకబడిపోయాను. అబ్బో! మీరు చాలా స్పీడుగా నడుస్తారే!” ఇంకా రొప్పుతూనే అన్నాడు.

“ముందుగా చెబితే కలిసే బయలుదేరే వాళ్ళం కదా! సరే పద.”

ఆఫీసు విషయాలు, ఇతర విషయాలూ మాట్లాడుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాము.

ఇక్కడ రామారావు గురించి రెండు మాటలు - నేను పని చేస్తున్న ఆఫీసులోనే గుమాస్తాగా పనిచేస్తున్నాడు రామారావు. దాదాపు ఇరవై సంవత్సరాల సర్వీసు ఉంటుంది. అయినా ఏ పనీ సరిగా చేయలేడు. కానీ ఆఫీసు పనిమీద ఎవరైనా వస్తే ఇట్టే పసిగట్టి లావాదేవీలు ఏర్పరచుకోవటంలో ఘను డని విన్నాను. నేను ఈ మధ్యనే వచ్చి ‘ఓ.ఎస్’ [ఆఫీసు సూపరింటెండెంటు]గా ఇక్కడ జాయి నయ్యాను. అప్పటి నుంచి అతని ప్రవర్తన గమనిస్తూనే ఉన్నాను. ఎవరి పనైనా, ఏ గుమాస్తాతో సంబంధించినదైనా చేయించి పెట్టగల సమర్థు డని ప్రతీతి కూడా ఉంది.

ఇంతలో తాజ్‌మహల్ హోటల్ సెంటరుకు చేరుకున్నాం.

“సార్! టీ తాగి పోదాం” అన్నాడు రామారావు.

తటపటాయించాను. నేను కొత్త. అతని స్వభావం తెలిసి కొంత. ఏ పని భుజాన వేసుకొచ్చాడో అన్న శంక పొడసూపింది. ఇతను నన్ను టీకి ఆహ్వానించడం ఇదే మొదటిసారి. కాదంటే సభ్యతగా ఉండదేమో! ఆలోచనలతోనే అప్రయత్నంగా “సరే పద.” అనేశాను.

అతనిలో కొంత ఉత్సాహం కనిపించింది.

హోటల్లో ప్రవేశించాం. వచ్చే పోయే జనంతో రద్దీగా ఉంది. ఎక్కడా ఖాళీలు కనిపించడం లేదు.


ఇంతలో ఓ మూల రెండు కుర్చీలు ఖాళీ కావడంతో త్వరగా వెళ్ళి కూర్చున్నాం.

సాయంత్రం వేళ తాజ్‌మహల్ హోటల్ రద్దీగా ఉండటం ఇదివరకే గమనించాను. ఆఫీసు నుంచి బయటపడ్డ ఉద్యోగస్తులు, రిటైరైన ఉద్యోగస్తులు. విద్యాలయాలు విడిచి వచ్చే విద్యార్థులు ఈ తాజ్‌మహల్ హోటల్లో ఓ టీ సేవిస్తే ఏదో మనసుకు ఆహ్లాదం కలుగుతుందని అంటారు. ఈ తాజ్‌మహల్‌లో టీ సేవిస్తే ఆగ్రా లోని తాజ్‌మహలు చూసినంత ఆనందం కలుగుతుం దని హాస్యోక్తి పలికేవారూ లేకపోలేదు.

చల్లని నీళ్ళు పుచ్చుకున్నాం.

“సార్! ఏదైనా టిఫిన్ తీసుకుందాం” అన్నాడు మర్యాద పూర్వకంగా.

కొంచెం కంగారుగా అనిపించింది నాకు. ఇతని వాలకం అనుమానాలకు తా విస్తోంది.




“ఏం వద్దు. టీ చాలు.”

“పరవాలేదు సార్! రెండు ప్లేట్లు పూరీ తేవేయ్!” అని ఆదేశించాడు సర్వరును.

ఆలోచనలో పడ్డాను. ఇతని ప్రవర్తనకూ, టిఫిన్‌కూ ఏదో పని ముడి పడి ఉంటుం దని అనుకుంటూనే, “వద్దూ! వద్దు! నాకు టీ చాలు” అని కొంచెం నిష్కర్షగా చెప్పేశాను.

రామారావు కొంచెం చిన్నబుచ్చుకొన్నట్టుగా కనిపించాడు.

“సరేలే! రెండు టీ తెచ్చిపెట్టు” అని సర్వరును పంపివేశాడు.

‘టీ’ కార్యక్రమం ముగించుకుని బయటి కొచ్చాం.

నెమ్మదిగా నడుస్తున్నాం. ఇంతలో ఓ పార్కు కనిపించింది.

“సార్! కొంచెం సేపు పార్కులో కాలక్షేపం చేద్దామా?” అన్నాడు రామారావు అభ్యర్థిస్తున్నట్టు.

ఏమిటి నన్ను వదలడంలేదు? నా వల్ల ఏదైనా లాభాన్ని ఆశించి నా వెంట పడుతున్నాడా?

డబ్బు నాశించి ఏదైనా పార్టీ పని భుజాన వేసు కొచ్చుంటాడా?

ఇతని మనస్తత్వం గురించి అంతకు ముందే కొంత విని ఉండటం వల్ల రకరకాలుగా పోతున్నాయి నా ఆలోచనలు.

సరే చూద్దాం లెమ్మనుకొని “ఓ! దాని కేం?” అనేశాను.

పార్కులో కూర్చున్నాం. ఆఫీసులోని సంగతులు, అవీ ఇవీ ముచ్చటిస్తూ - మధ్యలో “మిమ్మల్ని ఓ మాట అడగాలని ఉంది సార్! అడగమంటారా?” అన్నాడు సంశయిస్తూ.

అర్థమైంది - నెమ్మదిగా రంగంలోకి దించటానికి ప్రయత్నిస్తున్నా డని, జాగ్రత్త పడలాని మనస్సులో ఓ మూల నుంచి హెచ్చరిక వినవచ్చింది.

“దాని కేం? అడగవచ్చు” అన్నాను పరిశీలనగా అతని మొహంలోకి చూస్తూ.

రామారావు ఏనుగు నెక్కి నంత సంబరపడ్డాడు. తాజ్‌మహల్ హోటల్లో గులాబ్ జామ్ తిన్నంత తృప్తిగా ముఖం పెట్టాడు. పెద్ద పార్టీ దొరికితే జేబు నిండినంత సంతోషపడ్డాడు. మరీ చెప్పా లంటే ప్రమోషన్ వచ్చినంత ఆనందపడ్డాడు.

అటూ, ఇటూ సర్దుకు కూర్చున్నాడు. కాస్త వక్కపొడి తీసి నోట్లో వేసుకున్నాడు. మెలికలు తిరుగుతున్నాడు. మాట మాత్రం బయటికి రావడం లేదు. ఎలా అడగాలా, ఎటు నుంచి మొదలుపెట్టాలా అనే సంశయంలో కొట్టుకుంటున్నట్టు కనిపించాడు.

అతని అవస్థ చూసి నేనే చొరవగా - “మాట్లాడ వేమయ్యా రామారావ్?” అన్నాను మెల్లగా నవ్వుతూ.

“ఆ! ఏం లేదు సార్! మీరు ఈ ఊరు వచ్చి ఓ.ఎస్.గా జాయినయి రెండు నెలలు దాటింది. మీ నిజాయితీ, పనిలో నేర్పు అందరం చెప్పుకుంటూనే ఉన్నాం. కాని చిన్న సందేహం ...”

“ఏమి టది?”

“మీరు రోజూ ఆఫీసుకు వచ్చి సీట్లో కూర్చునే

ముందుగా జేబులోంచి పర్సు తీసి భక్తిగా కళ్ళకద్దుకొని కూర్చుంటున్నారు. అదే ఏమిటో అర్థం కావటం లేదు సార్ మన వాళ్ళందరికీ.

రోజూ మాలో మేమే - ఏదో ఊహాగానాలు చెయ్యటం తప్ప మిమ్మల్ని అడగటానికి ధైర్యం చాలడం లేదు. అందరి తరపునా నే నడుగుతున్నాను సార్! పొరపాటైతే క్షమించాలి" అని ఊరకుండి పోయాడు.

"ఓ! అదా!" అని తేలికగా గాలి పీల్చుకున్నాను.

రామారావు నోటి నుంచి ఎలాంటి మాట వినవలసి వస్తుందో అని ఇంతవరకూ రకరకాలుగా ఊహించిన నాకు ఈ ప్రశ్న వినగానే ఎంతో రిలీఫ్ కలిగింది.

"అయితే మన వాళ్ళ కెవరికీ భక్తీ ముక్తీ - వీటి మీద నమ్మకా లేవీ లేవంటావా?"

"అమ్మో! అంత మంచి అలవాట్లే! ఎవడు దొరుకుతా డా, రూపాయి ఎలా సంపాదించాలా అనే ఆలోచనే తప్ప ఓ భక్తీ ఓ ముక్తీ ఓ మంచీ ఉందండీ? అమ్మమ్మ!" అన్నాడు వ్యంగ్యంగా. అక్కడికి త నేదో వాటికి అతీతుడైనట్లు.

నవ్వాను. అతనూ నవ్వాడు ఓ మంచి విషయం చెప్పినట్లుగా.

అయితే రామారావు హేళన చేస్తున్నాడా? లేక నే చేస్తున్న దేమిటా అని తెలుసుకోటానికి ఉత్సాహపడుతున్నాడా? అర్థం కాలేదు. ఈ పరిస్థితి నాకు కొత్త కాదు. ఇంతకు ముందు కూడా కొంత మంది అడగటం, నేను జవాబు చెప్పటం అయ్యాయి.

చిన్న ఉపోద్ఘాతం ప్రారంభించాను - "చూడు రామారావ్! ప్రతి మనిషీ పుట్టుకతో చెడ్డవాడు కాదు. పరిస్థితుల ప్రభావం వల్ల స్వార్థం అవధులు దాటటం వల్ల, బుద్ధి వర్కించి తప్పులు చేస్తుంటాడు. లేని దాని కోసం పాకులాడటం కన్నా ఉన్నదానితో సంతృప్తి చెంది బ్రతకటంలో హాయి ఉంది కదా! ఏ మంటావ్?"

"ఏమంటాను సార్! చాలా మంచి విషయమే. కాని నేటి పరిస్థితులలో అలా ఉండలేకపోతున్నారు. ఆడంబరమైన జీవితా ని కోసం అబద్ధాలు, అపసవ్యపు పనులు తప్పటం లేదు."

"అదే! ఆడంబరమైన జీవితం గడపాలంటే మన ఆదాయానికి, స్థితికి మించిన పనైపోవటం లేదా? చివరకు అప్పులతో తిప్పలు పడటం లేదా?"

"నిజమే సార్! కాని నేటి సమాజంలో ఎవరు చొరవతో ముందుకు వెళ్ళి నాలుగు డబ్బులు సంపాదిస్తారో, ఆడంబరంగా కనిపిస్తారో, వారే ఘనత పొందుతున్నారు. వారికే పరపతి, గౌరవం కూడానూ. అంతే గాని ఎలా సంపాదించారు అనే ప్రశ్నకు తావే లేదు సార్ నేడు. ఇవన్నీ నేను మీకు చెప్పాలా!"

"అవును. ఈ అన్యాయపు, అక్రమ సంపాదన కూడ దని మనం పలికే సుభాషితాలు వారికి వినిపిస్తాయా? చిన్నవాళ్ళ దగ్గర నుండి పెద్ద వాళ్ళ వరకు ఎవరి ధోరణి వారిది. సరే ..."

"సార్! అసలు విషయం ..." అని నసిగాడు - నే నేదో మాటల్లో పెట్టి అసలు విషయం దాట వేస్తున్నా నని అనుమాన పడి.



"మరిచిపోలేదు. చెపుతాను."

"మంచిది సార్!" అన్నాడు కుతూహలంగా.

"మా దొక చిన్న గ్రామం. అందులో మా దొక పేద కుటుంబం. నాకు ఊహ తెలిసే నాటికి మా నాన్నగారు లేరు. స్వాతంత్ర్యోద్యమ మంటూ వెళ్ళి మళ్ళీ తిరిగి రాలే దని అమ్మ చెపుతూ ఉండేది. వస్తా డనే పిచ్చి నమ్మకం ఉంది అమ్మకు. నాకు ఒక చెల్లె లుంది. మా అమ్మ కష్టపడి పోషిస్తూ, చదివిస్తూ ఉండేది.

మా గ్రామంలో హైస్కూలు లేకపోవడం వల్ల పక్క ఊరికి వెళ్ళి చదువుకునే వాళ్ళం. నెమ్మదిగా స్కూలు ఫైనల్‌కు వచ్చాను. ఏం రామారావ్ వింటున్నావా?"

"అయ్యో! వింటున్నా సార్!"

ఓ రోజున "అమ్మా! పరీక్ష ఫీజు కట్టడానికి రేపే ఆఖరి రోజు" అన్నాను.

"సరే కట్టేద్దాం" అంది అమ్మ.

"వారం రోజుల నుంచి అలాగే అంటున్నావ్."

"కట్టేద్దాం బాబూ రేపు."

"రేపు ఫీజు కట్టకపోతే ఈ సంవత్సరం చదివిన చదు వంతా వృథా" అన్నాను దీనంగా.

"అలా జరగదు బాబూ! రేపు తప్పకుండా ఇస్తాను కదా" అని నమ్మకంగా చెప్పింది అమ్మ.

సంతృప్తితో బడికి వెళ్ళిపోయాను.

మరునటి రోజు బడికి బయలుదేరుతుండగా డబ్బు ఇచ్చింది అమ్మ.

సంతోషంగా చూశాను. పరీక్ష పాస్ అయినంత సంబరపడ్డాను. అయినా అమ్మ కష్టం కొంచెం లోలోన గుర్తుంది. ఆప్యాయంగా చూసింది అమ్మ నా వంక.

ఇంతలో రామారావు "మీ అమ్మగారు చాలా కష్టపడ్డా రండీ మీ కోసం" అన్నాడు.

"అవును. తల్లి దండ్రులు పిల్లలపై చూపే అనురాగం, ఆప్యాయత, ప్రేమ మరి ఎక్కడ నుంచి పొందగలం? చెప్పు."

"నిజమే! కాని ..." ఏదో చెప్పబోయాడు రామారావు.

"కాని ఏమిటయ్యా! అసలు నిస్వార్థంగా ప్రతిఫలాపేక్ష లేకుండా చేసేది ఒక్క తల్లి దండ్రులేనయ్యా! ఏ దేవుడి గుళ్ళోకి వెళ్ళినా పత్రం, పుష్పం, ఫలం - ఏదో తీసు కెళ్ళాలి కదా" అని నవ్వాను.

అతనూ నవ్వి - "అది సరే సార్! మరి పెళ్ళవగానే, ఉద్యోగం దొరకగానే తల్లి దండ్రులను విడిచి వెళ్ళే పిల్లలు కూడా ఉన్నారు సార్!"

"వాస్తవమే. కాని అది వాళ్ళ అజ్ఞానం. సరే విను ..." అని కొనసాగించాను.

"డబ్బులు జాగ్రత్త బాబూ! బడికి వెళ్ళగానే కట్టేయాలి. దారిలో ఆటలు ఆడుకుంటూ పోకు. డబ్బులు పోతా యి" అని జాగ్రత్తలు చెప్పింది.

"అలాగే నమ్మా! జాగ్రత్తగా తీసుకు వెళ్ళి కట్టేస్తాను."

"నా బాబు పెద్దవాడై. నా కష్టాలు తీర్చే దెప్పుడో!" అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

నేను బడికి వెళ్ళిపోయాను. బడికి వెళ్ళి ఫీజు కట్టేశాను. రసీదు జాగ్రత్తగా పుస్తకంలో




దానాలలో శ్రేష్ఠమైనది అన్నదానం

శ్రీ వేంకటేశ్వర నిత్య అన్నదాన పథకానికి విరాళాలను వసూలు చేయడానికి సిటీ యూనియన్ బ్యాంక్ అంగీకారం పొందింది.

ఈ పథకానికి ఇవ్వబడే విరాళాలు భక్తులకు అన్నదానం చేయడానికి ఉపయోగించబడుతాయి. నేడే

సిటీ యూనియన్ బ్యాంక్

ద్వారా ఈ పథకానికి విరాళాలిచ్చి ఆ ఏడుకొండలవాని అనుగ్రహం పొందండి.

★ విరాళాలు రూ. 1000/- నుంచి రెట్టింపు సంఖ్యలో అంగీకరించబడతాయి.

★ ఈ పథకానికి ఇవ్వబడే విరాళాలకు ఆదాయం పన్ను చట్టం 80జి భాగం ప్రకారం పన్ను రాయితీ సదుపాయంగలదు.

విరాళాలివ్వడానికి, మరి ఇతర వివరాలకు నేడే మీ సమీపంలోని మా శాఖను సంప్రదించండి.

MCS/CUB/362 Tel

CUB

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్,
రిజిస్టర్డ్ ఆఫీస్: కుంభకోణం-612 001.
సియుబి - సదా మీ అభివృద్ధినే కాంక్షించే బ్యాంక్.

పెట్టుకున్నాను.

"సాయంత్రం ఇంటికి తిరిగి వస్తూండగా ఆలోచనలో పడ్డాను. అమ్మ డబ్బు ఎక్కడ తెచ్చింది? ఎవరి నడిగింది? ఎంత ఇబ్బంది పడిందో!. తండ్రి దగ్గర లేని మా ఇద్దరినీ తానే తల్లి, తండ్రి అయి పెంచుకొస్తోంది. తాను కష్టపడినా మాకు కష్టం తెలియ: నీయటం లేదు. స్కూల్ ఫైనల్ పాస్ అయి త్వరలో ఉద్యోగం సంపాదించి అమ్మను సుఖపెట్టాలి, చెల్లెలికి పెళ్ళి చేయాలి. ఏవేవో ఆలోచనలతో ఇంటికి చేరుకున్నాను.

"అమ్మ నడగాలి అనుకున్నాను. అడిగితే ఏమనుకుంటుందో? కోప్పడుతుం దేమో! లేక బాధపడుతుందేమో! అనిపించింది. సరే. చెల్లి ఇంటిదగ్గరే ఉంది కదా. చెల్లి నడుగుదామనిపించింది. అడిగాను.

చెప్ప నంది. అమ్మ చెప్పవ ద్దంది.

అర్థం కాలేదు. నాకూ తెలుసుకోవాలనిపించింది. చెప్పమని బతిమాలాను.

అమ్మను అడగ నని చేతిలో చెయ్యి వేయించుకుని అప్పుడు చెప్పింది - "అమ్మ కాళ్ళ కడియాలు అమ్మేసింది" అని.

"అమ్మా!" అని నాలో నేనే అనుకున్నాను. ఏమి అనాలో తెలియలేదు. తెలియని, బయటకు చెప్పరాని బాధ ఏదో నన్ను కలిచివేసింది. అచేతనంగా కూర్చుండిపోయాను.

"అన్నయ్యా! అమ్మ నడక్కు. నన్ను తిడుతుంది" అంది చెల్లి.

ఆ సమయంలో అమ్మ అటు వైపు వచ్చింది.

ఉదయం ఫీజు డబ్బు తీసుకున్న సంతోషంలో బడికి వెళ్ళిపోయాను. ఏ ఆలోచనా రాలేదు. కాని బడి నుంచి వచ్చేటప్పుడు కలిగిన సందేహాన్ని చెల్లి చెప్పిన విషయంతో నివృత్తి చేసుకున్నాను. ఇప్పుడు బోసిగా ఉన్న అమ్మ కాళ్ళు చూశాను అమ్మకు తెలియకుండా. అప్పుడు గాని తెలియలేదు అమ్మంటే ఏమిటో. అమ్మ చూపిన ప్రేమ, ఆప్యాయత, పట్టుదల ఏమిటో."

నా గొంతులో కొంచెం జీర, అస్పష్టత ఏర్పడ్డాయి.

అంతలో రామారావు "సారీ సార్! మిమ్మల్ని అనవసరంగా ..." అన్నాడు.

"అ దేం లేదు. పాత విషయాలు నెమరువేసుకుంటున్నాం కదా!

"చాలా కాలం అమ్మను అడగలేదు. అడగటానికి ధైర్యం చాలలేదు.

"స్కూల్ ఫైనల్ మంచి మార్కులతో పాస్ కావడం, ఆ తరువాత కొద్ది కాలానికి నా కో చిన్న ఉద్యోగం రావడం జరిగాయి.

"ఉద్యోగం వచ్చిన రోజున "అమ్మా! నాకు ఉద్యోగం వచ్చింది." సంతోషంతో చెప్పాను.

"అదృష్ట వంతుడివి బాబూ!" అని ఆనంద బాష్పాలు రాల్చింది.

అమ్మ ఇంతకాలంగా మా బాగు కోసం చేసిన కృషి ఫలించిందనీ, తన బాధ్యతను జాగ్రత్తగా నిర్వర్తించా ననీ సంతృప్తితో ఊపిరి పీల్చుకుంది.

"అదృష్టం నీవు కలిపించిందే నమ్మా! తల్లీ, తండ్రి నీవై భయ భక్తులతో పెంచావు. అదే మా అదృష్ట మమ్మా!"

"... ..."

"నీవు కష్టపడి మాకు తిండి పెట్టావు, చదివించావు. అంతే కాదమ్మా, నీవు ఆ రోజున నీ కాళ్ళ కడియాలు అమ్మి పరీక్ష ఫీజు కట్టకపోతే నేను పరీక్ష రాయడం, పాస్ కావడం, ఉద్యోగం రావడం ఇవన్నీ జరిగేవా అమ్మా!" అన్నాను నాకే తెలియని ఉత్సాహంతో.

"చాలా రోజుల తరువాత ఈ విషయం నా ద్వారా వినడం అమ్మకు ఆశ్చర్యం కలిగింది. నాకు తెలియకూడ దనుకున్న విషయం తెలిసిందని కాబోలు. ఏం రామారావ్ వింటున్నావా?"

"ఆ! ఆ! వింటున్నాను సార్!" అని ఉలిక్కిపడ్డాడు.

"అమ్మ ఆ రోజున పరీక్ష ఫీజు కట్టడమే నా భవిష్యత్ జీవితానికి పునాది అయింది. అమ్మ శ్రమ, ప్రేమ నా భవిష్యత్తుకు బంగారు బాటలయ్యాయి. అమ్మ ఆశీర్వాదం వల్లనే నేటికి నేనింత వాడినైనాను. ఇంతకంటే ఏం కావాలి? అమ్మ ప్రేమాభిమానాలు పిల్లల్ని బాగుచేస్తాయని నా విశ్వాసం.

"రోజూ నేను కళ్ళకద్దుకునేది అమ్మనే! అమ్మ ఫొటోనే. అమ్మను స్మరించుకోవటం నా కర్తవ్యం.

"అమ్మ వల్లనే నాకు ఈ ఉద్యోగం వచ్చిం దనే నమ్మకంతోనే ప్రతిరోజూ సీటులో కూర్చునే ముందు మా అమ్మ ఫొటోను కళ్ళకద్దుకుంటున్నాను. దాన్ని నా విద్యుక్త ధర్మంగా భావిస్తాను. అమ్మను స్మరించడం వల్ల నాలో సంతృప్తి కలుగుతుంది. ఆత్మ విశ్వాసం ఏర్పడుతుంది. అది కలిగించే స్ఫూర్తితో రోజంతా హుషారుగా పనిచేసుకో గలుగుతాను."

అంత విని రామారావు ఆశ్చర్యంలో మునిగిపోయాడు. నోటి వెంట మాట రాక నా వంక చూస్తూ ఉండిపోయాడు.

"ఏమిటి రామారావ్! అలా ఉన్నావ్?" అని చేత్తో తట్టాను.

"సార్! మీది చాలా గొప్ప మనస్సు. నిజంగా మీ ఆచరణ మాకు ఆదర్శప్రాయం సార్! కాదు కాదు. శిరోధార్యం సార్!" రామారావు మాటల్లో నిజాయితీ ధ్వనించింది.

"సరే. లేద్దామా?"

"అలాగే సార్!"

పార్కు నుంచి బయటకు బయలుదేరాం. ★

